# రాజనీతి

జి. శ్రీరంగ

**ఆ రోజు సూర్యోదయం జరిగేటప్పటికి రాజ ప్రాసాదానికి పది ఆమడల దూరంలో ఉన్న బహిరంగ సభాస్థలానికి జనం తండోప తండాలుగా చేరుకున్నారు. ఎవరి నోట విన్నా ఆనాటి శిక్ష అనుభవించే వ్యక్తి ప్రస్తావనే, ఆశ్చర్యకరమైన రాయల తీర్పు గురించి చర్చే. ఏమైనాగానీ ఇటువంటి శిక్ష కనీవినీ ఎరుగము అనుకుంటున్నారు విజయనగర పురజనులు.**

**అది రాయలకు పట్టాభిషేకం జరిగిన ఆరవ ఏడు. నాగులాపురం నిర్మాణం ఆగమేఘాలమీద జరిపిస్తున్నారు రాయలవారు.**

**అదేమి చిత్రమోగానీ రత్నసింహాసనం అధిష్ఠించిన నాటి నుంచీ రాయలు ఏదో తొందరలో వున్న ప్రయాణికుడిలాగా ప్రవర్తిస్తున్నాడు. తనకు ఉన్నది తక్కువ సమయమనీ, చేయవలసిన బృహత్ కార్యాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయని తలపోస్తాడో ఏమో ఎప్పుడు చూసినా అనేక కార్యక్రమాలను ఒకే పర్యాయము చేయడానికి చూస్తాడు.**

అదంతా బాగానే వుందిగానీ ఈ శిక్ష ఏమిటో, అనుకోని విధంగా రాయలు ఇలా చేయడమేమిటో ఎవరికీ అర్థం కావడంలేదు.

గుంపులు గుంపులుగా ప్రజలు బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. శ్రీకృష్ణదేవరాయలు, మహామంత్రి తిమ్మరుసు, సేనా నాయకుడు అడియప్ప విశ్వనాథ నాయకార్, ఇతర దండనాథులు, నాగులాపురం నగర వాస్తుశిల్పి కుమారనాథ శిల్పి, అతని అనుచరగణం అంతా పెద్ద వేదికపై ఉన్నారు.

తన పాలనలో ప్రజలకు కూడా భాగస్వామ్యం ఉండే విధంగా రాయలు చేపట్టిన అనేక అంశాలలో ఈ బహిరంగ సభా విధానం ఒకటి. ముఖ్యమైన విషయాలపై నిర్ణయాలను ప్రజలందరి ముందు ప్రకటించాలని రాయలు ఉద్దేశ్యం. నాగులాపుర నిర్మాణ నిర్ణయం కూడా ప్రజల సమక్షంలో తీసుకున్నదే.

ఇప్పుడు ఈ సంచలన విషయంలోనూ అంతకుముందు రోజు ప్రకటించిన విధంగా బహిరంగ నిర్ణయమే తీసుకోవాలని కూడా రాయల నిశ్చితాభిప్రాయం. రాజనీతి అంటే కపటంగా ఉండడం అని వాడుకలో అందరూ అనుకుంటారు.

కానీ నీతిగల పాలన అందించడమే రాజనీతి అనీ, రాజనీతిలో స్వపర భేదాలు ఉండరాదని ప్రభువుల అభిమతం.

ప్రజలందరూ అక్కడ జరగబోయే విశేషం గురించి ఆందోళనతో ఎదురు చూస్తున్నారు. వేదికకు పక్కగా రాజు విధించిన శిక్షలను అమలు చేసే తలారి పెనుబంటి కన్నయ్యా సిద్ధంగా ఉన్నాడు.

కండలు తిరిగిన దేహం, నీరెండలో మిల మిల మెరుస్తున్న దృఢకాయం, గుబురు మీసాలతో చూపరుల గుండెలదిరేలా ఉన్నాడు కన్నయ్య.

అంతలోనే వేదికపై కలకలం చెలరేగింది. రాజమాత నాగులాంబదేవి పైకి వచ్చింది. అందరూ గౌరవ పురస్కారంగా లేచి నిల్చున్నారు. రాజమాత ఉచితాసనంలో ఆసీనురాలైన తరువాత అందరూ తమ తమ స్థానాలలో కూర్చున్నారు.

రాయలు తిమ్మరుసు వైపు తిరిగి "అప్పాజీ ప్రారంభించండి" అన్నాడు.

తిమ్మరుసు లేచి ప్రభువుకు నమస్కరించి తరువాత సభను ఆసక్తిగా గమనిస్తున్న పుర ప్రజలందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు.

"విజయనగర పుర ప్రజల్లాలా! ఈరోజు ఇక్కడ జరగబోయేది మనకు విచారకరం. ప్రజలు సహనం పాటించి ఆందోళన చెందకుండా ఉండాలి. కాలం దాటరానిది అంటారు. విధి విపరీతం వలన శ్రీశ్రీశ్రీ కృష్ణదేవరాయల పాలనలో ధర్మం తప్పటడుగు వేసింది. అలా జరిగినందులకు స్వయంగా ప్రభువులే బాధ్యత వహిస్తూ శిక్షకు తలవొగ్గారు"

ప్రజల్లో హాహాకారాలు చెలరేగాయి. ఆ కలకలం చివురాకులా సవ్వడిగా మొదలై మహాసాగర ఘోషలా మారిపోయింది. రెండు చేతులు జోడించి మహామంత్రి తిమ్మరుసు ఆ జన ప్రభంజనాన్ని ముహూర్తకాలంలో మౌన గంభీరంగా మార్చేసాడు.

"మన ప్రభువు గైకొన్న నిర్ణయం చాలా సాహసోపేతమైనది. అది వారి మాతృభక్తినీ, దేశ భక్తినీ చాటి చెప్పడమే కాక వారి ధర్మనిరతిని కూడా ప్రస్ఫుటంగా తెలియజేస్తున్నది. ప్రభువుల కీర్తి తద్వారా విజయనగర సామ్రాజ్య కీర్తి ఈ భూమండలమంతా వ్యాపిస్తుందని ఒకవైపు సంతోషం కలిగినా ప్రభువులు శిక్ష అనుభవించడం అనేది మనలో ఏ ఒక్కరూ సహించలేమని నాకు తెలుసు"

మళ్లీ ప్రజలలో హాహాకారాలు చెలరేగాయి. ఈసారి ఆ ప్రభంజనాన్ని అదుపు చేయడానికి మహామంత్రి వల్ల కాలేదు. చివరకు రాయలు స్వయంగా సింహాసనం దిగి ప్రజల ముందుకు వచ్చి రెండు చేతులు జోడించాక ఒక్కసారిగా నిశ్శబ్దం చిక్కగా అలుముకుంది.

"మహాజనులారా! శాంతంగా ఉండండి. మా నిర్ణయాన్ని గౌరవించండి'' అన్నాడు శ్రీకృష్ణదేవరాయలు.

సూది కింద పడినా వినబడేంత నిశ్శబ్దం. మనసులో మెదిలే ఆలోచనలకే శబ్దం పుడుతుందేమోననే భయంతో తమ మనసులో ఆలోచనలు కూడా కదలకుండా నిలుపు చేసారు అంతా. రాయలు తిరిగి తన సింహాసనంపై ఆసీనుడయ్యాడు. శాంతించిన జన సందోహాన్ని ఉద్దేశించి మాట్లాడానికి మరోసారి సిద్ధపడ్డాడు అప్పాజీ.



"ఈ విపత్కర పరిస్థితి ఎలా ఆసన్నమయింది ఏ కారణంగా ప్రభువులు ఇటువంటి నిర్ణయం తీసుకున్నారు అని మీకు సందేహం కలుగుతూ ఉండి ఉండవచ్చు. అందుకే మీకు అన్ని వివరాలు తెలియజేస్తాను'' అంటూ జరిగిన విషయాన్ని అందరికీ చెప్పసాగాడు మహామంత్రి. అందరూ ఆసక్తిగా వినసాగారు.

★★★

విజయనగర సామ్రాజ్యానికి ప్రపంచ ప్రసిద్ధి తెచ్చింది ఆ నగర



## దేవదాసీగా మీరా జాస్మిన్

'భద్ర'లాంటి సూపర్‌హిట్ చిత్రంలో నటించిన మీరా జాస్మిన్ 'మహారథి' చిత్రం తరువాత మరే తెలుగు చిత్రంలోనూ నటించలేదు. తాజాగా 'ఇజ్జోడు' అనే కన్నడ చిత్రంలో మీరా జాస్మిన్ దేవదాసీ పాత్రను అత్యద్భుతంగా పోషించి కన్నడ ప్రేక్షకులను మెప్పించింది. ఈ చిత్రం తరువాత కన్నడ నిర్మాతలు మీరా జాస్మిన్‌ను తమ చిత్రంలో బుక్ చేసుకునేందుకు పోటీలు పడుతున్నట్లు సినీవర్గాల భోగట్టా!




నిర్మాణ కౌశలం. విదేశీ వాస్తు విజ్ఞానులను పిలిపించి స్వదేశీ జ్ఞానానికి పదును పెట్టించి రాయలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విజయనగర పునర్నిర్మాణాన్ని తలపెట్టాడు.

చక్కగా తీర్చిదిద్దిన విశాలమైన రాజ వీధులు, వాటికి అనువైన పురవీధులు, అలాగే వీధుల వెంబడి ఉండే అంగళ్లు, రాజ ప్రాసాదాలు, ఉన్నతాధికారుల, దండ నాయకుల భవనాలు అన్నీ ఎంతో చక్కగా ప్రణాళికాబద్ధంగా నిర్మింపజేసాడు రాయలు.

ఆ కార్యక్రమానికి రాయలు ఎంతో ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. మంచెన కుమారనాథ శిల్పిని ప్రధాన వాస్తు శిల్పిగా నియమించి అంతా అతని పర్యవేక్షణలో జరిగేటట్లు ఆదేశించాడు.

కుమారనాథ శిల్పి తన విద్యార్థులలో మేరికలలాంటి వారిని ఆరుగురిని ఎంపిక చేసి వారికి నగర నిర్మాణ బాధ్యతలను అప్పగించాడు. అలా పునర్నిర్మింపబడిన ప్రాంతాలవలన విజయనగరానికి కొత్త శోభ వచ్చింది. అది చూచి రాయలు చాలా సంతోషించాడు.

విజయనగరాన్ని పునర్నిర్మించిన తరువాత రాయలుకు తన తల్లి నాగులాంబ పేరున నాగులాపుర నిర్మాణం చేపట్టాలని కోరిక కలిగింది. తాను కూడా అక్కడ నివసించాలనే ఉద్దేశ్యంతో నాగులాపుర నిర్మాణం పూర్తి చేయడానికి గడువు కూడా నిర్ణయించాడు. కుమారనాథ శిల్పి రాయల ఆజ్ఞను పాటించడానికి కంకణం కట్టుకున్నాడు.

ప్రధాన శిల్పి కింద పని చేస్తున్న ఆరుగురి శిల్పులలో మాధవనాథుడు ఒకడు. అతడు మంచి ప్రతిభాశాలి. రాయలు సింహాసనం అధిరోహించిన కొత్తలో జైత్రయాత్రలకు సన్నద్ధమైనప్పుడు దుర్గ పరిరక్షణ కొరకు కుడ్యములను నిర్మించడంలోనూ, కందకములను, అగడ్తలను తవ్వించడంలోనూ, విజయనగరాన్ని పునర్నిర్మించడంలోనూ అతడు చేసిన కృషికి రాయల ప్రశంసలని పొందాడు.

కానీ ఎందుకనో నాగులాపుర నిర్మాణంలో మాత్రం అలసత్వాన్ని ప్రదర్శించసాగాడు మాధవుడు. ఒకపక్క నగర నిర్మాణానికి రాయలు విధించిన గడువు దగ్గర పడుతున్నది.

అయినా మాధవనాథుడి పరిధిలో జరుగవలసిన కార్యక్రమాలు నత్తనడక నడుస్తున్నాయి. ఎప్పటికప్పుడు రాజుకి ఏదో చెప్పూ నెట్టుకు వస్తున్నాడు కుమారనాథ శిల్పి.

మాధవుడిని పిలిపించి ఎందువలన అతడు పనిపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాడని విచారించాడు.

అయినా మాధవుడు ఏమీ చెప్పకపోయేసరికి ఆయనకు మాధవుడిపై సంశయం కలిగింది. ఏవైనా చెడు అలవాట్ల కారణంగా పనిని అశ్రద్ధ చేస్తున్నాడేమో అని సందేహించాడు. రహస్యంగా అతని చర్యలను గమనించడానికి మనుష్యులను పెట్టాడు.

చివరకు మాధవుడు తనకు వస్తున్న ఆదాయాన్నంతా ఖర్చు చేస్తూ తన ఆరోగ్యాన్ని కూడా అలక్ష్యం చేసేసరికి కుమారనాథుడికి విపరీతమైన కోపం వచ్చింది. విధి నిర్వహణలో అలక్ష్యం, విపరీతంగా ధనాన్ని ఖర్చు పెట్టడం చూస్తుంటే అతనికి దుర్వ్యసనాలు వచ్చి ఉంటాయని నిర్ధారించుకున్నాడు. ఆఖరుసారిగా మాధవుడిని పిలిచి హెచ్చరిక చేసాడు కుమారనాథ శిల్పి.

"మాధవా! నీ ప్రవర్తనలో ఇసుమంత మార్పు లేదు. ఇదే కొనసాగితే ప్రభువుల ఆజ్ఞ పాలించుటకు శక్యముకాదు. ఇది నీకు చివరి హెచ్చరిక. రాజాజ్ఞ మీరితే దండనార్హుడవుతావని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదుకదా'' అన్నాడు.

మాధవుడు తల వంచుకుని ఆయన మాటలు విన్నాడు. అంతేగానీ

పెదవి విప్పలేదు.

కానీ మరుసటి రోజు నగర నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని మాధవుడు దారి తప్పించాడని వార్త వచ్చింది. తనకు అందిన సమాచారం విన్న ప్రధాన శిల్పికి కోపం అవధులు దాటింది. వెంటనే దండ నాయకులకు కబురుచేసి మాధవుడిని పట్టించాడు.

ఎంత ప్రశ్నించినా తన తప్పులు ఒప్పుకుని బాధ్యత వహించడం మినహా ఎందుకు అలా చేసాడో చెప్పలేదు మాధవుడు. పోనీ చేసిన పనికి పశ్చాత్తాపం ప్రకటిస్తాడేమో అని చూసిన దండనాయకునికి కూడా మాధవుడు నిర్లక్ష్యంగా కనబడడంతో క్రోధావేశం కలిగింది.

రాజాజ్ఞను పాటించకపోవడంతోపాటు రాజ ధనాన్ని దుర్వినియోగం చేసాడనే అభియోగం మోపి శిక్షార్హుడిగా ప్రకటించాడు దండ నాయకుడు. కానీ ఒకప్పుడు రాయల చేతులమీదుగా ఎన్నో ప్రశంసలు, బహుమతులు అందుకున్నవాడూ, ఎంతో ప్రతిభావంతుడైన శిల్పి కావడంచేత మాధవుడి నేరాన్ని రాయల దృష్టికి తీసుకువెళ్లారు ప్రధాన శిల్పి, దండ నాయకుడు.

మాధవుడిని మరుసటి దినం రాయల నిండు సభలో ప్రవేశపెట్టారు. రాజు విధించిన గడువులోపు నాగులాపురం నిర్మించడానికి అందరూ కృషి చేస్తున్నా మాధవుడు మాత్రం రాజాజ్ఞ ఉల్లంఘించాడనే తీవ్రమైన నేరం అతనిపై ఆరోపించారు.

శ్రీకృష్ణదేవరాయలు తన మాతృభక్తిని చాటుకోవడానికి తల్లి పేరు మీద నాగులాపురం నిర్మిస్తున్నాడు.

ఆ పనికి చిన్నపాటి అవరోధం కలిగినా సహించడు. అలాంటిది మాధవుడు ఇంత అలక్ష్యం చేసాడని ఫిర్యాదు వచ్చింది. మాధవుడికి ఎటువంటి దండన పడుతుందోనని సభికులంతా కూడా చెవులు రిక్కించి కూర్చున్నారు.

శాంతంగా ఉన్నప్పుడు శ్రీకృష్ణదేవరాయలు ఎంత దయగానూ, ఉదారంగానూ ఉంటాడో, కోపం వచ్చినప్పుడు అంతే నిర్దయగానూ, కఠినంగానూ ఉంటాడు.

కానీ మాధవుని పూర్వ సేవలు స్మృతికి వచ్చాయో మరి దైవానుగ్రహం అలా ప్రదర్శితమైందోగానీ పది కొరడా దెబ్బల శిక్ష మాత్రమే విధించాడు రాయలు.

రాయలు తీర్పు ఇవ్వడమేమిటి, సభికులలో ఒక కలకలం రేగడమేమిటి రెండూ ఒక్కసారే జరిగాయి.

రాజభటులను తప్పించుకుని రాయల దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తోంది ఒక ముదుసలి. ఆమెను అడ్డగిస్తుంటే కలిగిన సందోహం రాయల దృష్టికి వచ్చింది.

రాజు సైగ అందుకుని అడియప్ప నాయకార్ ఆ ముదుసలిని రాయల ఎదుటకు తీసుకురమ్మని చెప్పాడు.


ఆమెను వెంటబెట్టుకుని రాయల సమక్షానికి తీసుకువెళ్లారు. ఆమెను ప్రశ్నించమని దివాన్‌ని కోరాడు రాయలు.

"ఎవరమ్మా నీవు?'' అడిగాడు దివాన్.

"ప్రభువుల వారి పాలనలో సుఖంగా జీవిస్తున్న ఒక తల్లిని మహారాజా'' అంది ఆమె రెండు చేతులు జోడించి రాయలను చూస్తూ. ఆ మాటలు వ్యంగ్యంగా వినిపించాయి.

"ఎందుకు ఈ సభలో గలాభా కల్పించావు?'' కఠినంగా ప్రశ్నించాడు.


"మహాప్రభూ! తల్లి కోరిక తీర్చడం కొడుకు ధర్మం. రాజమాత కోరారో లేదో మాబోంట్లకు తెలియదు. కానీ మహాప్రభువులు తన తల్లిగారి పేరున ఒక నగరాన్నే నిర్మింపజేస్తున్నారు. నా భర్త శూరనాధుడు, నా పెద్ద కొడుకు వీరనాధుడు ఇద్దరూ ప్రభువుల జైత్రయాత్రలలో పాల్గొని వీరస్వర్గం అలంకరించారు. వారితోపాటు కలసి వున్న గృహంలో నివశించడానికి మనసు రాక నాకు మరోచోట ఇల్లు కట్టించమని నా చిన్నకొడుకు మాధవుడిని కోరాను. కొంతవరకు నిర్మాణం సాగిన తరువాత పని ఆగిపోయింది. నాగులాపుర నిర్మాణానికి రాజ్యంలో ఎక్కడెక్కడి పనివారు తరలించబడ్డారు. నా ఇంటి కట్టుబడి పూర్తి చేయడానికి మనుషులే కాదు, సామగ్రి కూడా దొరకలేదు. నా కొడుకు నా కోరిక తీర్చడంకోసం తన అధీనంలోని మనుష్యలను, వస్తుసామగ్రిని వినియోగించాడు. ముమ్మాటికి అది తప్పే. కానీ




## జాకో బైక్

జర్మనీకి చెందిన దీదీసెంట్ అనే సైకిల్ డిజైనర్ భారీ చక్రాలతో ఒక సైకిల్‌ను తయారుచేసాడు. మైఖేల్ జాన్సన్‌కి 13 దేశాలలోని ముఖ్య నగరాల్లో దీనిపై తిరుగుతూ నివాళులర్పించేటందుకు సిద్ధమయ్యాడు. ఈ జాకోబైక్ పొడవు నాలుగు మీటర్లు.

-తటవర్తి



దోషిని నేను. దండన నాకు విధించండి. నా కొడుకుని విడిచిపెట్టండి. నా కొడుకు వంటిపై కొరడా దెబ్బలు తగిలితే అవి నా గుండెలపై గునపపు పోట్లు వలె బాధిస్తాయి. దయచేసి మాధవుడిని విడిచి నన్ను శిక్షించండి'' అంటూ రోదించసాగింది.

ఆమె భర్త, పెద్దకొడుకుల పేర్లు విన్న రాయలుకు, సభికులకు వారిరువురూ యుద్ధంలో రాయల ప్రాణరక్షణ కోసం తమ ప్రాణాలు అర్పించిన విషయం గుర్తుకువచ్చింది. అంతటి దేశభక్తి, ప్రభుభక్తి కనబరచిన వారి కుటుంబానికి ఇలా జరిగితే ఎలా? అందరి మనసులలో బాధ గూడు కట్టుకుంది.

ఆమె ఆవేదన సభలోని అందరి మనసులను కరిగించింది. రాయలు తీవ్ర ఆలోచనలో మునిగిపోయాడు. తాను నగరాన్ని నిర్మించాలనుకున్నప్పుడు సామాన్య ప్రజల అవసరాలను పట్టించుకోకపోవడం ఆయనకు కలత కలిగించింది.

త్వరగా తన ఆదేశం అమలు అవ్వాలని వత్తిడి పెట్టడంతో రాజ్యంలోని పనివాళ్లందరినీ నగర నిర్మాణం కోసం నాగులాపురం తీసుకు వస్తున్నారు. ఇతర చోట్ల కృత్రిమమైన కొరత ఏర్పడి మొదలు పెట్టిన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయి సామాన్య జనం ఎంత బాధ పడుతున్నారో కదా. ఎంత పని జరిగింది? అసలు దోషం తనదే... ఇలా ఆలోచిస్తూ రాయలు పరితపించాడు.

సభ అంతా రాయల నిర్ణయం కోసం చెవులు ఒగ్గి ఉంది. చివరకు రాయలు మాట్లాడాడు.

"సభికులారా! మాధవుడికి విధించిన శిక్షను రద్దు చేస్తున్నాము. అసలు తప్పు జరిగింది ఎవరివల్లో వారే దండనార్హులు. అందుకే మేమే ఆ శిక్షను అనుభవిస్తాము రేపు ఉదయం బహిరంగంగా విజయనగర పుర ప్రజల సమక్షంలో'' అని ప్రకటించి సభ చాలించి లేచి వెళ్లిపోయారు.

***

జరిగినదంతా బహిరంగ సభలో విజయనగర పుర ప్రజలందరికీ సవివరంగా తెలియజేసాడు మహామంత్రి తిమ్మరుసు. తాము విన్నది నమ్మడానికి మనస్కరించలేదు ప్రజలకి.

మాధవుడికి దండన తప్పించడంవరకు సరే, కానీ రాయలు దోషి ఎలా అవుతాడు? అనవసరంగా ఆయన దండన స్వీకరించడం ఏమిటి? అనుకున్నారు.

రాయలుకు నాగులాంబ మాత్రమేకాదు, తన జైత్రయాత్రలో దేశభక్తితో ప్రాణాలు అర్పించిన వీరసైనికుల తల్లులు కూడా మాతృ సమానులే అని సమన్వయపరిచారు కొందరు బుద్ధిమంతులు. అందుకే వారి కోరికలు పట్టించుకోలేకపోయానే అనే బాధతోనే తనను దోషిగా రాయలు భావించాడని వారు అన్నారు.

ప్రజలలో చెలరేగిన సద్దు కాసేపటికి మౌనంగా మారింది. రాయల నిర్ణయం తమకు బాధగా ఉన్నా ప్రభువు స్వయంగా తన నిర్ణయాన్ని గౌరవించమని కోరి ఉండడంవలన ప్రజలు మౌనంగానే తమ అర్ధాంగీకారాన్ని తెలిపారు. సద్దు మణిగిన తరువాత రాయలు సింహాసనాన్ని దిగి శిక్షా స్థలం వైపు నడవబోయాడు.

"మహారాజా! చిన్న మనవి'' అన్నాడు అప్పాజీ.

"సెలవీయండి అప్పాజీ'' అన్నాడు రాయలు.

"తమరు విజయనగర సామ్రాజ్య లక్ష్మీవల్లభులు. రాజుని శిక్షించగలిగే అధికారం ఎవరికీ లేదు. కాదు కూడదు తమరే ప్రభు స్థానంలో కూర్చుని ఉండగా శిక్షను ప్రకటించారు కనుక అడ్డంకి ఉండకూడదని తమరు భావిస్తే శిక్ష అనుభవించే కాలంలో తాము ప్రభువులుగా ఉండరాదు. ఎందుకంటే ఏకకాలంలో ప్రభువుగానూ, దండనార్హుడిగానూ ఉండడం సబబా?'' అన్నాడు అప్పాజీ.

ఆ మాట విన్న సభికులంతా ఆలోచనలో పడ్డారు.

రాయలు కూడా క్షణకాలం యోచించి "సరే మేము రాజ్యత్యాగం చేస్తాము'' అన్నాడు.

## ఆరోగ్యానిచ్చే ఆంపో కేక్స్

ఇండోనేషియాలోని తూర్పు జావా రాష్ట్రంలో టుబాన్ గ్రామంలో శతాబ్దాలుగా ఒక కుటుంబంవారు వరి పండించే పొలాల పక్కనున్న మట్టి నుంచి గులకరాళ్లని తొలగించి ఆ మెత్తని మన్నుతో ఆంపో అనే కేక్సుని తయారు చేస్తున్నారుట. ఆంపో కేక్సుని తింటే ఒంట్లో నొప్పులుండవట. గర్భిణీ స్త్రీలకి సుఖ ప్రసవమవుతుందిట. వాళ్ల పిల్లల చర్మం నిగనిగలాడుతుందిట. వీటి తయారీకి ప్రత్యేక పద్ధతంటూ లేదు. ఆ మెత్తని మన్నుని కర్రదిమ్మతో దిమ్మిసా చేసి బిస్కెట్లలా కేక్సుని తయారు చేసి తినవచ్చునట. అతి సహజమైన ఆ మట్టిలో మంచి రుచి, పరిమళం కూడా ఉంటాయిట.

## ప్రమాదం అంచున...

ఇంగ్లండ్‌లో 20 ఏళ్ల కేఅండర్‌వుడ్ అనే కాలేజీ విద్యార్థిని అందంగా, ఉత్సాహభరితంగా ఉంటుంది. ఆమె చిన్నగా నవ్వితే ఫర్వాలేదుగానీ పగలబడి నవ్వినా, కోపంతో ఉద్రేకపడినా ప్రమాదం ముంచుకొస్తుంది. ఒక్కసారిగా ఒళ్లు విరుచుకుని స్పృహతప్పి పడిపోతుంది. మొదట్లో ఆమె జోకు చేస్తోందని తోటివారు అనుకునేవారు. కానీ ఒకరోజున ఫ్రెండ్స్ చిలిపితనానికి నలభైసార్లు స్పృహతప్పి పడిపోయిందిట. డాక్టర్లు ఆమెను పరీక్షించి ఆమె ఒక అసాధారణమైన నరాల జబ్బుతో బాధ పడుతోందని, శృతిమించితే ఆమెకు హఠాత్తుగా ప్రాణం పోతుందని హెచ్చరించారుట. ముందు జాగ్రత్త కోసం ఆమె ఉద్రేకం కలుగుతున్నట్లు అనిపిస్తే తలని మోకాళ్ల మధ్య పెట్టుకోవడం, ఎవరినైనా ఒడిసి పట్టుకోవడం చేస్తూ తనని తాను నిగ్రహించుకుంటోందిట.

-తటవర్తి



ఆ మాటకు అందరూ నివ్వెరపోయారు.

తిమ్మరుసు చిన్నగా నవ్వుతూ "ప్రభూ! మీ ధర్మ నిరతి నేనెరుగనిది కాదు. కత్తిపట్టి జైత్రయాత్రలో ముందుండి సైన్యాన్ని నడిపిన తమరికి ఈ కొరడా దెబ్బలు ఏపాటివి. కానీ తమరు రాజ్య త్యాగానికైనా సిద్ధపడడమే నిజమైన ధర్మనిరతి. అయితే నా కోరిక మన్నించి రాజమాత నాగులాంబా దేవిని సింహాసనంపై తమరి స్థానంలో కూర్చుండజేయండి ప్రభూ" అన్నాడు అంజలి ఘటించి.

ఊపిరి బిగపట్టి వేదికపై జరిగే పరిణామాలను పరికిస్తున్నారు ప్రముఖులంతా. రాయలు వెళ్లి రాజమాతను సగౌరవంగా సింహాసనం దగ్గరకు తీసుకువెళ్లి కూర్చోబెట్టారు. అంతా మౌనంగా గమనిస్తున్నారు.

తిమ్మరుసు సింహాసనంపైవున్న నాగులాంబాదేవికి నమస్కరించి "రాజమాతా! ఇప్పుడు మీరే ఈ సామ్రాజ్యాధినేతలు. మీ ఆజ్ఞ ఇక్కడ అంతా శిరసావహిస్తాము. ఆజ్ఞాపించండి" అన్నాడు.

అప్పటికప్పుడు జరిగిన హఠాత్పరిణామాలకు ఒకింత తడబడినా రాజమాత నాగులాంబాదేవి తన మనసులోని అలజడిని బయట పడకుండా జాగ్రత్త పడింది.

ఎదురుగా ప్రియమైన కుమారుడు నిలబడి ఉన్నాడు. ఎంతటి శక్తివంతుడైన రాజైనా తల్లి కళ్లకు పసివాడిగానే కనబడతాడుకదా. తన సైనికుల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే రాజుగా రాయలు అంటే అందరికీ గౌరవమే. అలాంటిది నిన్న సభలో జరిగిన సంఘటన రాజు ఇంకా చేయవలసిన పనులను ఎత్తి చూపినట్లయింది.

సున్నిత మనస్కుడైన తన కుమారుడు ఆ లోపానికి తనదే బాధ్యత అని శిక్షకు సిద్ధపడ్డాడు. రాయలు అలా చేయడానికి అతని అంతరంగంలో పసివాడని పసితనమే కారణం.

ఆ రోజు నిండు సభలో పెద్దన కాలుకి స్వయంగా గండపెండేరం తొడిగాడు. అలా చేయడం రాయల గొప్పతనానికి అద్దం పట్టింది. కానీ అది వేరు ఇది వేరు. అది సాహితీ సేవగా సహృదయుల మెప్పు పొందింది. కానీ రాయలు శిక్ష అనుభవిస్తే అర్థం చేసుకునేవారికంటే అపార్థం చేసుకునేవారే ఎక్కువగా ఉంటారు. ఆలోచిస్తుంటే ఆమె మాతృహృదయం తల్లడిల్లిపోయింది. ఏమి చేయాలి అని తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి ఇలా అంది.

"మహామంత్రీ! క్లిష్టమైన సమస్యను మా ముందు ఉంచారు. సరే మా నిర్ణయం వినండి. మా పేరిట నిర్మించబడుతున్న నాగులాపురం సామాన్య ప్రజలకు ప్రమోదాన్ని కలిగించాలి. కొరడా దెబ్బల శిక్ష అప్పాజీ సెలవిచ్చినట్లు పెద్ద శిక్షే కాదు. అందుకే రాయలు ఆ నగరంలో నూతన గృహ వసతి కోరిన వీర సైనికుల కుటుంబాలకు వాటిని కట్టించి ఇవ్వవలసిందిగా ఆజ్ఞాపిస్తున్నాను. కొరడా దెబ్బల శిక్షకు బదులుగా రాయలు ఈ ఆజ్ఞను పాటించాలి. ఈ ప్రణాళిక మాధవనాథుడి పర్యవేక్షణలో జరపవలసిందిగా కూడా ఆదేశిస్తున్నాను" అంది.

ఆమె మాటలకు వేదికపైవున్న వారే కాక సభాస్థలిలో వున్న ప్రజలంతా ఆనందపరవశులయ్యారు. దిక్కులు పిక్కటిల్లేలా "నాగులాంబాదేవికి జై, శ్రీకృష్ణదేవరాయలకూ జై, మహామంత్రి తిమ్మరుసుకీ జై" అంటూ జయజయధ్వానాలు చేసారు.

అంజలి ఘటించి నాగులాంబాదేవికి వినమ్రుడై నమస్కరించాడు శ్రీకృష్ణదేవరాయలు.


"కుమారా!" అంటూ రాయలను ప్రియమార పిలిచింది నాగులాంబ.

తల్లి దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు రాయలు.

"నీ మాతృభక్తి, ధర్మనిరతి తెలుగునాట ప్రతినోటా ఆచంద్రతారార్కం నిలిచి ఉండాలని మనసారా కోరుకుంటున్నాను" అంది ఆనందాశ్రువులు నిండిన నయనాలతో. "వచ్చి ఈ విజయనగర ప్రజలందరికీ నీతి కలిగిన సుపరిపాలన అందించు నాయనా" అంటూ తాను గద్దె దిగి రాయలను చేయి పట్టి సింహాసనం అధిష్ఠింపజేసింది.

ఒక తల్లిగా నాగులాంబ తన కుమారుడికి దిశానిర్దేశం చేసి తెలుగు వల్లభుడికి ఎనలేని కీర్తి కట్టబెట్టింది.

★



## 'రారాజు'గా ప్రభాస్

ప్రభాస్ హీరోగా గతంలో దిల్ రాజు నిర్మించిన 'మున్నా' ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. తాజాగా ప్రభాస్ హీరోగా మరో చిత్ర నిర్మాణానికి దిల్‌రాజు సన్నద్ధమవుతున్నాడు. ఈ చిత్రానికి 'రారాజు' అనే టైటిల్‌ను ఖాయం చేసినట్లుగా తెలుస్తోంది. ప్రభాస్ చిత్రం అంటే ప్రేక్షకులు ఏం కోరుకుంటారో, అవన్నీ ఈ చిత్రంలో వుంటాయనీ, ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటుందన్న నమ్మకం తనకుందని దిల్ రాజు ఆశాభావం వ్యక్తం చేసాడు.

